





హిందువాహిని ఆధ్వర్యంలో సిద్దిపేటలో ర్యాలీ

ఛత్రపతి శివాజీకి జై..

● ఘనంగా శివాజీ జయంతి

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 19 : సిద్దిపేట జిల్లాలో సోమవారం ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో హిందువాహిని ఆధ్వర్యంలో స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శివాజీ విగ్రహ పునప్రతిష్ఠ కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా ఎల్లమ్మగుడి చౌరస్తా నుంచి లాల్‌కమాన్ గుండా వేంకటేశ్వరాలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దత్తగిరి మహరాజ్ ఆశ్రమం సిద్దేశ్వరణందగిరి స్వామిజీ, సామాజిక సమరసత ప్రముఖ్ అప్పాల ప్రసాద్‌జీ హాజరయ్యారు. ఈ సందర్భంగా అప్పాల ప్రసాద్ జీ హిందూ సంప్రదాయం, శివాజీ జీవిత చరిత్రను వివరించారు. ప్రపంచంలోనే మనదేశ సంస్కృతి చాలా గొప్పదని కొనియాడారు. అనంతరం సిద్దేశ్వరణందగిరి స్వామిజీ మాట్లాడారు. సనాతన ధర్మం కాపాడడానికి అందరూ ఛత్రపతి శివాజీలా తయారు కావాలని సూచించారు. అనంతరం అతిథులందరూ కలిసి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పునా నుంచి వచ్చిన కళాకారులు బ్యాండ్ బాజలు, నృత్యాలతో అలరించారు. హిందు వాహిని కార్యకర్తలు, విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దల్, ఏబీవీపీ, తపస్ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



సిద్దిపేటలో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అప్పాల ప్రసాద్ జీ, సిద్దేశ్వరానందగిరి స్వామిజీ

బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా

కలాల్ శ్రీనివాస్



సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 19 : భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడిగా సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్‌కు చెందిన గాండ్ల శ్రీనివాస్ అలియాస్ కలాల్ శ్రీనివాస్ ఎన్నియ్యారు. గోదావరిఖనిలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. శ్రీనివాస్ మొదటగా ఏబీవీపీలో, తర్వాత బీజేపీలో, అలాగే ఆర్‌ఎస్‌ఎస్‌లోనూ పని చేశారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అయిన ఆయన ఏడేళ్ల క్రితం వలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నారు. బీఎంఎస్‌లో సామాన్య కార్యకర్తగా చేరి, బీఎంఎస్ అనుబంధ బీడీ కార్మిక సంఘానికి జాతీయ అధ్యక్షుడిగా పనిచేశారు. జాతీయ కార్మిక సలహా మండలి సభ్యుడిగా ప్రస్తుతం బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తాజాగా బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తనను ఎన్నుకున్నందుకు ఈ సందర్భంగా ఆయన కార్మిక లోకానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతం పోరాటాలు చేస్తానని చెప్పారు. శ్రీనివాస్ ఎన్నికపై హర్షం వ్యక్తం చేస్తూ బీఎంఎస్ నాయకులు సిద్దిపేటలో సోమవారం సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కొండల్‌రెడ్డి, మల్లేశం, కిష్టయ్య, చంద్రమౌళి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి

ప్రజావాణి దోహదం

● అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి




అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

సిద్దిపేట అగ్రికల్చర్, ఫిబ్రవరి 19: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి దోహదపడుతుందని, అర్జీదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజావాణిలో ఫిర్యాదుదారుల నుంచి ఆయన దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 24 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. జిల్లా అధికారులు విధిగా ప్రజావాణికి హాజరుకావాలనిపై ఉన్నతాధికారుల అనుమతి లేనిదే గైర్హాజరు కావొద్దని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, డీఆర్డీఏ పీడీ జగదేవ్ ఆర్యా అధికారులు పాల్గొన్నారు.

అన్యాయంగా ఉద్యోగం నుంచి తీసేశారు

మాజీ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు కాంట్రాక్ట్ పద్ధతిన తమకు నర్సింగ్ ఉద్యోగాలు ఇచ్చారని, అన్యాయంగా ఉద్యోగం నుంచి తీసేశారని అవుట్ సోర్సింగ్ నర్సింగ్ ఉద్యోగులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా తమ కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ సేవ చేశామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఎలాంటి సమాచారం, ఆర్డర్ లేకుండానే ఉద్యోగం నుంచి తొలగించారని వాపోయారు. తమను తిరిగి వెంటనే ఉద్యోగంలో తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

డబుల్ బెడ్‌రూంల గతేంటి?



గజ్వేల్ మండలం దాచారంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లు

- ఇళ్లు మంజూరై ఎనిమిదేళ్లు
- ఉమ్మడి జిల్లాలో సగానికిపైగా నిర్మాణం పూర్తి
- వేల సంఖ్యలో అసంపూర్తిగానే..
- పలుచోట్ల ఇంకా ప్రారంభానికి నోచని పనులు
- పూర్తయిన కొన్నింటిలో మౌలిక వసతులు కరువు
- సిద్ధమైన వాటినీ పంపిణీ చేయడంలో నిర్లక్ష్యం
- మిగతా వాటి సంగతి ఇక అంతేనా?

ఆంధ్రజ్యోతిప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 19: గత ప్రభుత్వ పెద్దలు ప్రాతినిధ్యం వహించిన ఉమ్మడి మెదక్ జిల్లాలోనే డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇంకా పూర్తిగా లబ్ధిదారులకు అందలేదు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎనిమిదేళ్ల కిందట ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన డబుల్ ఇళ్ల నిర్మాణాలు ప్రశ్నార్థకంగా మారాయి. 2015-16, 2016-17 ఆర్థిక సంవత్సరాల్లో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించడంలో గత పాలకులు చొరవ చూపించలేకపోయారు. టెండర్లు ఖరారు చేసి, నిర్మాణాలు ప్రారంభించిన డబుల్ ఇళ్లలో ఇంకా వేల సంఖ్యలో అసంపూర్తిగానే ఉన్నాయి. నిర్మాణాలు పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు అందజేయడంలోనూ అప్పటి పాలకుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. మరికొన్ని ఇళ్ల నిర్మాణాలు జరిగినా వైరింగ్, నీటి కనెక్షన్ వంటి పనులు జరగక అలాగే ఉండిపోయాయి. ఇంకా మొదలుపెట్టని ఇళ్ల సంగతేంటో వారికే తెలియాలి. అధికార వర్గాల సమాచారం మేరకు ఇళ్ల నిర్మాణాలు ఇంకా ప్రారంభంకాని చోట స్థల సమస్య ప్రధానంగా నెలకొన్నది. అలాగే, బిల్లుల చెల్లింపులోనూ జాప్యం జరుగుతుందన్న భావనతో ఆయా ప్రాంతాల్లో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు.

కొత్త ప్రభుత్వ నిర్ణయమేంటి?

కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు అనే పథకాన్ని తీసుకు వచ్చిన నేపథ్యంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిస్థితి ఏమిటీ అన్న ఆందోళన నెలకొన్నది. ఇప్పటికే పూర్తయిన సగంలో ఉన్న ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తుందా లేదా అన్నది తేలాల్సి ఉంది. అసంపూర్తి దశలో ఉన్న ఇళ్ల నిర్మాణాల సంగంతేంటో స్పష్టం చేయాల్సి ఉంది.



దాచారంలో పంపిణీ చేయని ఇళ్లలో మందుబాటిళ్లు, విస్తరాకులు

సంగారెడ్డి జిల్లాలో..

- అందోలు మండలం తల్మెలలో మంజూరైన 50 డబుల్ బెడ్ రూం ఇళ్లలో నిర్మాణం చేపట్టిన 36 ఇళ్లు ఇంకా బేస్‌మెంట్ స్థాయిలోనే ఉన్నాయి.
- చౌటకూర్ మండలం సరాఫ్‌పల్లి, శివంపేటలలో డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మాణం ప్రారంభానికే నోచుకోలేదు.
- నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో మంజూరైన 116 ఇళ్లలో ఒక్కటీ పూర్తి కాలేదు.
- హత్నూరలో మంజూరైన 30 ఇళ్లు, ఇదే మండలం సికింద్లాపూర్‌లో మంజూరైన 14 ఇళ్లలో ఒక్కటీ పూర్తి చేయలేదు.
- సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్ పేటలో మంజూరైన 30 ఇండిపెండెంట్ ఇళ్లు, 20 ఫ్లాట్ల నిర్మాణాల్లో ఒక్కటీ పూర్తి చేయలేదు.
- కొండాపూర్ మండలం అలియాబాద్‌లో నిర్మాణం చేపట్టిన 220 డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి.
- పటాన్‌చెరు మండలం చిట్కుల్, ముత్తంగి, మండలకేంద్రమైన జిన్నారం, ఇదే మండలంలోని కొడకంచి, గుమ్మడిదల మండలం కొత్తపల్లిలో 400 ఇళ్ల నిర్మాణాలకు టెండర్లు ఖరారయ్యాయి. వీటిలో 240 ఇళ్ల నిర్మాణాలకు టెండర్లు ఖరారయ్యాయి. వీటిలో 240 ఇళ్ల నిర్మాణాలు చేపట్టినా అన్నీ అసంపూర్తిగానే ఉన్నాయి.
- జహీరాబాద్ అర్బన్‌కు సంబంధించి హోతి (కె)లో నిర్మాణం చేపట్టిన 660 ఇళ్లలో ఒక్కటీ పూర్తి కాలేదు.
- మండలకేంద్రమైన మొగుడంపల్లిలో 150 ఇళ్లు, న్యాల్‌కల్‌లో 150 ఇళ్ల నిర్మాణాలకు టెండర్లు ఖరారైనా ఒక్క ఇంటి నిర్మాణాన్ని కూడా మొదలుపెట్టలేదు.



కొండాపూర్ మండలం అలియాబాద్‌లో అసంపూర్తిగా డబుల్ ఇళ్లు

సిద్దిపేట జిల్లాలో ..

- గజ్వేల్‌లోని సంగాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లలో మల్లన్నసాగర్ భూనిర్వాసితులు తాత్కాలికంగా నివాసం ఉంటున్నారు. దీంతో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పేదలకు ఇళ్ల పంపిణీ జరగలేదు.
- దూళిమిట్ట మండలం బైరాన్‌పల్లిలో 18 ఇళ్లను నిర్మించినా పంపిణీ చేయలేదు.
- దుబ్బాక మండలంలోని బల్వంతాపూర్, పెద్ద చీకోడు, చౌదర్‌పల్లి, రఘోత్తమపల్లి, గోసాన్‌పల్లి గ్రామాల్లో డబుల్ బెడ్రూం ఇళ్లను అనధికారికంగా కేటాయించడంతో వివాదాస్పదమైంది. అదే విధంగా దుబ్బాక పట్టణంలో నిర్మించిన ఇళ్లలో 108 ఇళ్లను నేటికీ పంపిణీ చేయలేదు.
- మిరుదొడ్డి మండలం భూంపల్లిలో మాత్రమే ఇళ్లను పంపిణీ చేశారు. మిగిలిన చోట్లా పంపిణీ చేయకున్నా ఎవరికివారు వెళ్లి అనధికారికంగా నివాసముంటున్నారు.
- గజ్వేల్ మండలం దాచారంలో డబుల్ ఇండ్లు అసంపూర్తిగా ఉన్నాయి. బిల్లులు ఇవ్వనందువల్లే ఆగిపోయినట్లు తెలిసింది.
- తొగుట మండలం బండారుపల్లి, పెద్దమాసాన్‌పల్లి గ్రామాల్లో డబుల్ ఇళ్లను నిర్మించినా పంపిణీ చేయలేదు. నాయకుల మధ్య ఆధిపత్య పోరు వల్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి కానట్లుగా తెలిసింది.
- ములుగు మండలం బండ మైలారంలో డబుల్ ఇళ్లు అర్ధాంతరంగానే నిలిచిపోయాయి.



జిన్నారం మండలం కొడకంచిలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లు

మెదక్ జిల్లాలో..

- మండల కేంద్రమైన హవేళిఘనపూర్‌లో 40 ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు అందజేశారు. అయితే ఈ ప్రాంతంలో సీసీరోడ్లు వేయలేదు. దాంతో లబ్ధిదారులు వర్షాకాలంలో ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తుంది. 40 ఇళ్లకు ఒక్కటే ఉన్న సెప్టిక్ ట్యాంకు పొంగి పొర్లుతుండడంతో దుర్వాసన నెలకొన్నది.
- చిన్న శంకరంపేట మండలం కొరివిపల్లిలో మంజూరైన ఎనిమిది ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగానే ఉన్నాయి.



తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లిలో నిరుపయోగంగా ఉన్న డబుల్ ఇళ్లు

ఉమ్మడి జిల్లాలో మంజూరైన ఇళ్లు 25,967
నిర్మాణం మొదలైనవి 21,002
పూర్తయినవి 16,365
లబ్ధిదారులకు అందజేసినవి 16,100

మూడు జిల్లాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల వివరాలు

	సంగారెడ్డి జిల్లా	మెదక్ జిల్లా	సిద్దిపేట జిల్లా
మంజూరైన ఇళ్లు	5,934	4,776	15,257
ప్రారంభమైనవి	5,136	3,660	12,000
పూర్తయినవి	4,198	2,567	9,600
అందజేసినవి	4,150	2,050	8,000
అసంపూర్తిగా	1784	1100	3,257

'గౌరవెల్లి'ని అడ్డుకున్నది కాంగ్రెస్, బీజేపీలే..

● హన్మకొండ జడ్పీచైర్మన్ మారంపల్లి సుధీర్ కుమార్

అక్కన్నపేట, ఫిబ్రవరి 19 : కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు కుమ్మక్కై బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు కోర్టులో కేసులు వేసి గౌరవెల్లి ప్రాజెక్టును అడ్డుకున్నారని హన్మకొండ జిల్లా పరిషత్ చైర్మన్ మారంపల్లి సుధీర్ కుమార్ ఆరోపించారు. సోమవారం అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి ప్రాజెక్టును సందర్శించిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఆనాటి మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు భూ నిర్వాసితులను ఒప్పించి, ప్రాజెక్టు పనులు పూర్తి చేయించారని, ఒక టీఎంసీ నీరు నింపి ట్రయల్ రన్ కూడా నిర్వహించారని తెలిపారు. ప్రాజెక్టు పనులు పూర్తి చేశామని, కేవలం కాలువల నిర్మాణం చేపట్టాల్సి ఉందని ఇంతలోనే ఎన్నికలు రావడంతో అవి ఆగిపోయాయని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కాలువల నిర్మాణం చేపట్టి, రైతులకు సాగునీరు అందివ్వాలని డిమాండ్ చేశారు. నెల రోజుల్లో సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చిన మంత్రి పొన్నం దానిని నేరవేర్చకపోతే గ్రామాల్లో తిరుగనియ్యమని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా మేడిగడ్డ వద్ద నిర్మించిన బ్యారేజ్ వద్ద నాలుగు పిల్లర్లు కుంగిపోతే అవినీతి జరిగిందని బీఆర్‌ఎస్ పార్టీ పై అబాండాలు వేస్తున్నారని ఆరోపించారు. 86 పిల్లర్లల్లో నాలుగు కుంగిపోతే అవినీతి జరిగినట్లా అని ప్రశ్నించారు. అవినీతి జరిగితే రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకే అప్పులు చేయవలసి వచ్చిందని, దేశంలోనే అభివృద్ధిలో తెలంగాణను మొదటి స్థానంలో నిలపడానికి కేసీఆర్ కృషి చేశారని తెలిపారు.



గౌరవెల్లి ప్రాజెక్టు వద్ద మాట్లాడుతున్న సుధీర్‌కుమార్

మళ్లీ బీజేపీలోకి

విజయ్‌పాల్‌రెడ్డి

నారాయణఖేడ్, ఫిబ్రవరి 19: నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి తన అనుచరులతో కలిసి సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరారు. విజయపాల్‌రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ ఎమ్మెల్యే టికెట్‌ను నిరాకరించడంతో బీఆర్‌ఎస్‌లో చేరగా.. తాజాగా ఆయన సొంత గూటికి వచ్చారు. ఆయనను రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి కండువా కప్పి, పార్టీలో చేర్చుకున్నారు. విజయపాల్‌రెడ్డి వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మారుతీరెడ్డి, కంగ్టి మాజీ ఎంపీపీ శివాజీపాటిల్, ముత్యాల సురేష్, నర్సింహాగౌడ్, గోవింద్‌నాయక్, తదితరులు ఉన్నారు. నారాయణఖేడ్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, విజయపాల్‌రెడ్డి స్వయాన సోదరులు. చేరిక కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డి, బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర నాయకులు అమర్ సింగ్, అనంత్‌రావు కులకర్ణి, తదితరులు ఉన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి

● సిద్దిపేట సీపీ డాక్టర్ బి. అనురాధ

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 19 : సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్, భరోసా సెంటర్, సఖి సెంటర్‌లను సోమవారం పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్లో ఉన్న వివిధ విభాగాలను సందర్శించారు. 5ఎస్ ఇంప్లిమెంటేషన్ ప్రకారం ఫైళ్లు ఏ విధంగా ఉన్నాయో పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని, వారి మర్యాదకు ఎలాంటి భంగం కలిగించవద్దని సూచించారు. ప్రజల రక్షణకు గురించి ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని అన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ఇసుక, పీడీఎస్ బియ్యం, అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. సైబర్ నేరాలు, మహిళల రక్షణకు ఉన్న చట్టాలపై ప్రజలకు అవగాహన కలిగేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం భరోసా సెంటర్‌ను సందర్శించి భరోసా సెంటర్లో నమోదవుతున్న కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. భరోసా సెంటర్‌కు వచ్చే ప్రతి ఒక్కరికీ సత్వరమే భరోసా కల్పించాలని, భరోసా సెంటర్‌కు వచ్చే బాధిత మహిళలకు, పిల్లలకు అన్ని రకాల సేవలు అందించాలని సూచించారు. సఖి సెంటర్లో మహిళలకు అందిస్తున్న సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ అపూర్వ రెడ్డి, భరోసా సెంటర్ సిబ్బంది, సఖి సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సఖి సెంటర్‌ను సందర్శిస్తున్న సీపీ డాక్టర్ బి. అనురాధ




గజ్వేల్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు, దుబ్బాకలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి శివాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యాలు



దౌల్తాబాద్ మండలం చెట్ల నర్సంపల్లిలో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రఘునందన్‌రావు



కోహెడలో శివాజీ జయంతి వేడుకల్లో యువకులు



నంగునూరు: శివాజీ జయంతి వేడుకల్లో ఉత్సవ కమిటీ సభ్యులు



నారాయణరావుపేట: శివాజీ శోభాయాత్రలో పాల్గొన్న హిందూవాహిని సభ్యులు

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

మరాఠా వీరుడు ఛత్రపతి శివాజీ జయంతి కార్యక్రమాలను జిల్లావ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణాలు, గ్రామాల్లోని కూడళ్లలో శివాజీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలు హైందవ సంఘాల ఆధ్వర్యంలో కాషాయ జెండాలు ధరించి ప్రధాన వీధుల్లో జై భవానీ.. జై శివాజీ అని నినదిస్తూ ర్యాలీలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, వివిధ హిందూ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.




గజ్వేల్‌లో హిందూ సంఘాల ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం, కుకునూరుపల్లిలో వేడుకల్లో శివాజీ యూత్ సభ్యులు

గజ్వేల్, ఫిబ్రవరి 19: ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని శివకేశవ, సీతారామాలయం నుంచి ఎంపీడీవో కార్యాలయం, అంగడిపేట హనుమాన్ ఆలయం, మార్కెట్ రోడ్డు, ఇందిరాపార్కు, బస్టాండ్, అంబేడ్కర్ చౌరస్తా, వివేకానంద చౌరస్తా మీదుగా శివాజీ విగ్రహం వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. జై భవానీ.. జై శివాజీ నినాదాలతో రోడ్లన్నీ మార్మోగాయి. అనంతరం శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నరేశ్‌బాబు, పూజారి నందబాలశర్మ, నాయకులు పాల్గొన్నారు. కాగా గజ్వేల్ పట్టణంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి తదితరులు శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శివాజీ జయంతి సందర్భంగా అదనపు డీసీపీ మల్లారెడ్డి, గజ్వేల్ ఏసీపీ బాలాజీల ఆధ్వర్యంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

● **దుబ్బాక/మిరుదొడ్డి:** దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఛత్రపతి శివాజీ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. దుబ్బాకలో ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి, బీజేపీ, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ నాయకులు శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే మిరుదొడ్డి, ఆరెపల్లి, ధర్మారం గ్రామాల్లో శివాజీ విగ్రహానికి నివాళులర్పించారు.

● **రాయపోల్:** యువకులు ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన దౌల్తాబాద్ మండలం చెట్ల నర్సంపల్లి గ్రామంలో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. హిందూ ధర్మ పరిరక్షణకు యువకులు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నర్సంపల్లి యువకులు, నాయకులు ఉన్నారు.

● **కోహెడ:** మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సామాజిక కార్యకర్త వేల్పుల శంకర్ ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే ఆరేపల్లి, చెంచల్ చెరువుపల్లి గ్రామాల్లో జయంతి వేడుకలు నిర్వహించారు.

● **చేర్యాల:** చేర్యాల పట్టణంలో విశ్వహిందూపరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో స్థానిక రామాలయం నుంచి అభయాంజనేయస్వామి ఆలయం వరకు ర్యాలీ చేపట్టారు.

● **నంగునూరు:** మండల కేంద్రంలో ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వల్లపు రెడ్డి రజనీకర్ రెడ్డి, చౌడుచెర్ల వెంకట్ రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● **మద్దూరు:** మద్దూరు మండలకేంద్రంలో రామాలయ యూత్ ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు, వృద్ధులకు పండ్లు పంచిపెట్టారు.

● **కొండపాక:** కుకునూరుపల్లి మండలకేంద్రం లో ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఉమ్మడి కొండపాక మండల వాసవీక్లబ్ అధ్యక్షుడు, విశ్వహిందూ పరిషత్ జిల్లా బాధ్యుడు ఉప్పల రాజుతో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా కొండపాక మండలం దుద్దెడ శివారులో టోల్‌గేట్ సమీపంలో తొగుటకు వెళ్లే రోడ్డు చౌరస్తాలో దుద్దెడ ఆరె క్షత్రియ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు, దుద్దెడ ఎంపీటీసీ బాలాజీ ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో పాటు బజరంగ్ దళ్ సభ్యులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, హిందు వాహిని సభ్యులు పాల్గొన్నారు.

● **నారాయణరావుపేట:** నారాయణరావుపేట మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద కాషాయ జెండాను ఎగురవేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు సంతోష్ కుమార్, హిందువాహిని ప్రతినిధులు సుధాకర్, శ్రీకాంత్‌గౌడ్, మహేష్, స్వామి, బీజేపీ మండల అధ్యక్షుడు పొన్నాల బాబు తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల తహసీల్దారుగా సమీర్ అహ్మద్‌ఖాన్

చేర్యాల, ఫిబ్రవరి 19 : చేర్యాల తహసీల్దారుగా సమీర్ అహ్మద్‌ఖాన్ సోమవారం కార్యాలయ రికార్డుల్లో సంతకాలు చేసి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న జోగినిపల్లి రాజేశ్వర్‌రావును ఇటీవల సిద్దిపేట జిల్లా కలెక్టరేట్‌కు, ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలో పనిచేస్తున్న సమీర్‌ఖాన్‌ను చేర్యాలకు బదిలీ చేసిన విషయం విదితమే.

గౌరారం ఎస్ఐగా శివకుమార్

వర్గల్, ఫిబ్రవరి 19: మండలంలోని గౌరారం ఎస్ఐగా శివకుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి అనురాధను కలిసి పూల మొక్కను అందజేశారు. కాగా ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన శివకుమార్‌ను పోలీస్ సిబ్బందితో పాటు స్థానిక బీఆర్ఎస్ మండల పార్టీ ఉపాధ్యక్షుడు తుమ్మ గణేశ్ శాలువాతో సన్మానించారు.

24న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కోహెడ, ఫిబ్రవరి 19: కోహెడ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 24న ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో కృష్ణయ్య తెలిపారు. ఎంపీపీ కొక్కుల కీర్తి అధ్యక్షతన జరిగే సమావేశానికి మండల, డివిజన్ అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

హైమద్‌నగర్‌కు కుర్చీల విరాళం

రాయపోల్, ఫిబ్రవరి 19: మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్‌హుస్సేన్ హైమద్‌నగర్ గ్రామానికి కుర్చీలను అందజేస్తానని గతంలో హామీ ఇచ్చారు. ఈ హామీ మేరకు రెండు వందల ప్లాస్టిక్ కుర్చీలను హైమద్‌నగర్‌కు పంపించారు. సోమవారం మండల బీఆర్ఎస్ నాయకులు వాటిని గ్రామస్థులకు అందజేశారు.

పరీక్ష ప్యాడ్‌లు అందజేత

ములుగు, ఫిబ్రవరి 19: మండలంలోని జప్తిసింగాయపల్లికి చెందిన నీలం ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌తో పాటు నోట్ బుక్కులు అందజేశారు. ప్రభాకర్‌రెడ్డిని, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ట

కొండపాక, ఫిబ్రవరి 19 : కుకునూరుపల్లి మండలం మాత్ పల్లి గ్రామంలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ట తో పాటు శివలింగ, పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు.

కురుమలకు అండగా నిలిచిన కేసీఆర్

● **మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు**



సంగుపల్లిలో బీరప్ప-కామరాతి కల్యాణోత్సవంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు

గజ్వేల్, ఫిబ్రవరి 19: కురుమలు మాట తప్పని నిజాయితీపరులని రాష్ట్ర మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు కొనియాడారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సంగుపల్లిలో నిర్వహించిన బీరప్ప-కామరాతి కల్యాణోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిజాయితీరులైన కురుమలకు కేసీఆర్ అండగా నిలిచారన్నారు. హైదరాబాద్‌లో కురుమల ఆత్మగౌరవ భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉందన్నారు. కేసీఆర్ కురుమలకు అన్ని రకాలు అండగా నిలిచారని, కురుమలు ఆయనకు అండగా నిలవాలన్నారు. గజ్వేల్ ప్రాంతాన్ని కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేశారని, రూపురేఖలు మార్చారన్నారు. బీరప్ప దేవుడి దయతో కేసీఆర్‌కు ఆయురారోగ్యాలు కల్పించాలని ఆకాంక్షించారు.

రేణుకా ఎల్లమ్మ వార్షికోత్సవం

గజ్వేల్ పట్టణంలోని పిడిచెడ్ రోడ్డులో కొలువై ఉన్న శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ పంచమ వార్షికోత్సవంలో మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆయన వెంట ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, కౌన్సిలర్లు బబ్బూరి రజిత, గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పల్లా.. దొంగ ఓట్లపై చర్చకు సిద్ధమా?: కొమ్మూరి

చేర్యాల, ఫిబ్రవరి 19: దొంగఓట్లతో ఎమ్మెల్యేగా గెలిచిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి బహిరంగ చర్చకు రావాలని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సవాల్ విసిరారు. సోమవారం చేర్యాల పట్టణంలోని ఆయన స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అడ్డదారిన 18వేలమంది నియోజకవర్గేతరుల ఓట్లు నమోదుచేయించుకున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని విమర్శించారు. దొంగ ఓట్ల విషయాన్ని తాను నిరూపిస్తానని, అందుకు పల్లా రాజేశ్వర్ రెడ్డికి బహిరంగచర్చకు సిద్ధమాఅని ప్రశ్నించారు. తాను ఓడినా నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని, ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చి అన్నిరంగాల్లో తీర్చిదిద్దుతానన్నారు.



మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న కౌన్సిలర్ నరేందర్ తదితరులు

కాంగ్రెస్‌లో చేరిక

చేర్యాల మున్సిపల్ 5వ వార్డు కౌన్సిలర్ ఆడెపు నరేందర్, మల్లన్న ఆలయకమిటీ మాజీ చైర్మన్ ఆడెపు చంద్రయ్య, గ్రంథాలయసంస్థ మాజీ చైర్మన్ నాగుల వెంకటేశం, ఆడెపు మహేశ్, తదితరులు బీఆర్ఎస్‌ను వీడి మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి, మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ముదిరాజ్‌ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి



నీలం మధును సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

గజ్వేల్, ఫిబ్రవరి 19: ముదిరాజుల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు కృషి చేయాలని గజ్వేల్ ముదిరాజ్ సంఘం నాయకులు నీలం మధు ముదిరాజ్‌ను కోరారు. నీలం మధు కాంగ్రెస్ పార్టీలో చేరికను, బీసీ కులగణనను స్వాగతిస్తూ సోమవారం గజ్వేల్ నియోజకవర్గ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని మల్లారెడ్డి గార్డెన్‌లో ఆత్మీయ సన్మానాన్ని నిర్వహించారు. ముదిరాజ్ కులస్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లాలని నీలం మధుకు విజ్ఞప్తి చేశారు. ముదిరాజ్‌లను బీసీ-డి నుంచి బీసీ-ఏలోకి మార్చాలన కోరారు. అనంతరం నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజ్ సామాజిక వర్గ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ముదిరాజ్ రాష్ట్ర కన్వీనర్ తెలంగాణ ముదిరాజ్ మహాసంఘం డాక్టర్ గుండ్లపల్లి శ్రీను, ముదిరాజ్ రాష్ట్ర కో కన్వీనర్ అల్లుడు జగన్, గజ్వేల్ ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు అండగా..

గజ్వేల్, ఫిబ్రవరి 19: తల్లిదండ్రులను కోల్పోయిన ముగ్గురు పిల్లలకు ఎన్ఎంఆర్ యువసేన అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు నీలం మధు ముదిరాజ్ అండగా నిలిచారు. గజ్వేల్ మండలం కొల్గూరు గ్రామానికి చెందిన సీరుడి భాస్కర్ డ్రైవర్‌గా, వీఆర్ఏగా పని చేస్తూ ఏడాదిన్నర క్రితం అనారోగ్యంతో మరణించాడు. రెండు నెలల క్రితం భార్య కవిత సైతం తీవ్ర అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో అనాథలైన వారి పిల్లలు కావ్య(6), శ్రీవాణి(4), కుమార్(18నెలలు)కు కాంగ్రెస్ రాష్ట్ర నేత నీలం మధు ముదిరాజ్ అండగా నిలబడ్డారు. సోమవారం కొల్గూరులో చిన్నారులను పరామర్శించారు. పిల్లలు ఒక్కొక్కరికి రూ.50వేల చొప్పున మొత్తం రూ.1.50 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. అంతే కాకుండా తక్షణ ఖర్చుల కింద మరో రూ.50 వేలను అందించారు. భవిష్యత్తులో పిల్లల చదువుల కోసం తన వంతు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. వారితో గ్రామ సర్పంచ్ మల్లం రాజు, ఎంపీటీసీ స్వామి, ముదిరాజ్ సంఘాల అధ్యక్షులు,ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

బీసీ భవన్‌కు నిధులు మంజూరు చేయాలి

● **మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి**

హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 19 : హుస్నాబాద్‌లో బీసీభవన్ నిర్మాణానికి నిధులతో పాటు రెండెకరాల భూమిని కేటాయించాలని కోరుతూ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సోమవారం వినతి పత్రం సమర్పించినట్లు బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ తెలిపారు. అలాగే కల్లుగీత కార్మిక సంఘానికి ఐదు గుంటల భూమి, రూ. 20లక్షల నిధులు మంజూరు చేయాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు గట్టు సాయి, దుద్దెడ రాజేష్ ఉన్నారు.

గజ్వేల్ ఏసీపీని కలిసిన ఆర్టీసీ డిపో మేనేజర్



ఏసీపీ బాలాజీకి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న డీఎం సురేఖ

గజ్వేల్, ఫిబ్రవరి 19: గజ్వేల్ ఏసీపీగా నూతనంగా బాధ్యతలను స్వీకరించిన బాలాజీని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బస్ డిపో మేనేజర్ బి.సురేఖ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారివెంట అసిస్టెంట్ మేనేజర్ బాబునాయక్ తదితరులున్నారు.

వక్ఫ్ బోర్డు చైర్మన్‌ను కలిసిన పూజల హరికృష్ణ



రాష్ట్ర వక్ఫ్ బోర్డు చెర్మన్‌తో సిద్ది పేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి19: రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా నియమితులైన అజ్మతుల్లా హుస్సేన్‌ను సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పూజల హరికృష్ణ, టీపీసీసీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు కలీం మొహీద్దీన్‌అహ్మద్, యూత్ కాంగ్రెస్ సిద్దిపేట అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ వహాబ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అజ్మత్, ఇమ్రాన్ ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ నెల 21న నాంపల్లి హజ్‌హౌస్ మైదానంలో ఆయన పదవీబాధ్యతలు చేపట్టనున్నారు.

సమ్మక్క సారాలమ్మల చెంతకు..

మేడారంలోని సమ్మక్క సారలమ్మలను సోమవారం సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ కుటుంబసమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజల హరికృష్ణ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, సీతక్క సమక్షంలో జాతరకు విచ్చేస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్నీ సౌకర్యాలు కల్పించారని తెలిపారు.

ఇందిరాగాంధీ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ

చిన్నకోడూరు, ఫిబ్రవరి 19 : దేశ తొలి మహిళా ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ విగ్రహ ఏర్పాటుకు సోమవారం చిన్నకోడూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మిట్టపల్లి కనకరాజు, శ్రీనివాస్, మల్లేశం, ఎల్లయ్య, సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పోచమల్లు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యమివ్వాలి



ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న అంగన్‌వాడీలు

దుబ్బాక, ఫిబ్రవరి 19: కాళేశ్వరంపై కాంగ్రెస్‌పార్టీ అనవసర గొడవలకు పోకుండా రాజకీయాలకు అతీతంగా ముందు రైతాంగ ప్రయోజనాలకు ప్రాధాన్యమివ్వాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. చిన్న లోపాలను బూచిగా చూపి, తెలంగాణ రైతాంగాన్ని కరువులో నెట్టవద్దని కోరారు. సోమవారం ఆయన దుబ్బాకలోని ఒక ఫంక్షన్ హాల్‌లో 153 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్‌లను పంపిణీ చేశారు. అలాగే 20 దివ్యాంగులకు ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాతే కాళేశ్వరంతో కూడవెళ్లి, హల్దీవాగు, శ్రీరాంసాగర్‌లాంటి ప్రాజెక్టులకు నీరు చేరిందన్నారు. మహత్తరమైన ప్రాజెక్టులు నిర్మిస్తే, కొన్ని లోపాలు ఏర్పడటం సహజమనీ, చిన్న లోపాలను సరిదిద్దేందుకు చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వం కటకట పెట్టి, కాళేశ్వరంను మూసేయాలనీ చూస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రజల ప్రయోజనాలను గుర్తించి, ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. గతంలో అసంపూర్తిగా ఉన్న కాలువలను వెంటనే పూర్తి చేయాలన్నారు. విద్యుత్ శాఖలో సక్రమంగా పనులు కావడంలేదని విమర్శించారు. తాను అడిగేవరకూ మల్లన్నసాగర్‌కు నీళ్ల వదలలేదన్నారు. ప్రభుత్వం ప్రజలను, రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకోవాలని కోరారు. ఆయన వెంట ఎంపీపీ కొత్తపుష్పలత, జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వనితారెడ్డి, ఆసయాదగిరి, బానాల శ్రీనివాస్ తదితరులున్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

మిరుదొడ్డి, ఫిబ్రవరి 19: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. మిరుదొడ్డి ఎస్ఐ పరశురాములు తెలిపిన వివరాల ప్రకారం.. మిరుదొడ్డి గ్రామానికి చెందిన మొగుళ్ల కనకయ్య అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు పొందకుండానే స్థానిక ట్రాక్టర్‌లో నాగయ్య వాగులో నుంచి ఇసుకను తరలిస్తున్నాడు. ఈ సమాచారమందుకున్న పోలీసులు వాగు వద్దకు చేరుకుని అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

విద్యుత్ స్తంభాల నుంచి వైరు చోరీ



వైర్లను తెగ్గొట్టిన విద్యుత్ స్తంభాలు

కొండపాక, ఫిబ్రవరి 19: రవీంద్రనగర్ విశ్వనాథపల్లి గ్రామపంచాయతీ శివారులోని రాజీవ్ రహదారి పక్కనే ఉన్న రెండు వెంచర్లలో గల విద్యుత్ వైర్ ను అపహరించుకెళ్లిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాజీవ్ రహదారి పక్కనే 18 ఎకరాల విస్తీర్ణంలో గల ఓ వెంచర్‌లో సుమారు 70 విద్యుత్ స్తంభాలతో పాటు మరో వెంచర్‌లో 10 విద్యుత్ స్తంభాలకు విద్యుత్ వైర్‌ను ఏర్పాటు చేసి బల్బులను అమర్చారు. గత నాలుగు రోజులుగా దీపాలు వెలగకపోవడంతో సోమవారం వెళ్లి చూసేసరికి రెండు వెంచర్లలోగల విద్యుత్ వైర్‌ను గుర్తు తెలియని దొంగలు ఎక్కడికక్కడ కట్ చేసి అపహరించారు. సుమారు రూ.30 లక్షల విలువైన వైరు చోరీ జరిగినట్టు అంచనా వేస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ప్లాట్లు కొనుగోలు చేసినవారు తెలిపారు.

మా పొలాలకు సాగునీరివ్వరా?

● **భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు కూరెల్లి జస్వంత్ రెడ్డి**



అధికారులతో మాట్లాడుతున్న రైతులు

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 19: మండల పరిధిలోని బండ చర్లపల్లి గ్రామంలోని బండ చెరువులోకి నీరు వస్తుండగా, అది పూర్తిగా నిండకుండానే ఇరిగేషన్ అధికారులు తూమును తెరిచి నీటిని ఇతర గ్రామాలకు తరలిస్తున్నారని భారతీయ కిసాన్‌సంఘ్ జిల్లా అధ్యక్షుడు కూరెల్లి జస్వంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పుల్లూరు గ్రామ రైతులు సోమవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తమ గ్రామానికి రావాల్సిన నీరు అందకుండా పోతుందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బండ చర్లపల్లి గ్రామంలోని బండ చెరువు పూర్తిగా నిండడం ద్వారా, అలుగు పారిన నీరుతో తమ గ్రామంలోని వెంకటాయ చెరువు నిండుతుందని, తద్వారా తమ పొలాలకు నీళ్లు వస్తాయని వివరించారు. కాగా ఇరిగేషన్ అధికారులు ఎవరికీ సమాచారం ఇవ్వకుండా చెరువు నిండకముందే తూమును ఓపెన్ చేసి నీటిని వేరే గ్రామానికి వదిలారన్నారు. చెరువు పూర్తిగా నిండితే గ్రామంలోని కొంతమంది లీడర్ల భూములు మునిగిపోయే ప్రమాదం ఉన్నందువల్లే నీళ్లను వేరే వైపు మళ్లిస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఈఈ సాయిబాబా స్పందిస్తూ తూము వెంటనే మూసేస్తామని పుల్లూరు రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పుల్లూరు మాజీ సర్పంచ్ పల్లె నరేష్‌గౌడ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేకి మోదీని గద్దె దించాలి: లక్ష్మారెడ్డి



హుస్నాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు

హుస్నాబాద్, ఫిబ్రవరి 19: రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రధాని మోదీని గద్దె దించాలని హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. ఢిల్లీలో చేస్తున్న రైతుల దీక్షకు మద్దతుగా సోమవారం హుస్నాబాద్ పట్టణంలో జేఏసీ ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తా నుంచి అక్కన్నపేట చౌరస్తా వరకు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంటనే రైతులతో చర్చలు జరిపి వారి డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, జేఏసీ కో ఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్, కొయ్యడ కొంరయ్య, జేఏసీ కో కన్వీనర్ ముక్కెర సంపత్‌కుమార్, వడ్డెపల్లి మల్లేశం, ప్రజా సంఘాల నాయకులు తదితరులున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 19: సిద్దిపేట రూరల్ మండలంలోని ఇర్కోడ్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం సాహాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఘన వ్యర్థాల నిర్వహణపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తడి, పొడి ప్రమాదకరమైన చెత్తను వేరు చేసి ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి స్టీలు వస్తువులు, క్లాత్ బ్యాగ్‌లు ఉపయోగించాలని సూచించారు. విద్యార్థులకు జియోమెట్రీ బాక్స్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మొగిలి జీవన్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ మారెడ్డి మధుసూదన్ రెడ్డి, సంస్థ మేనేజర్ శేఖర్, కో ఆర్డినేటర్ చిన్న, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్‌సెంటర్ సేవలను వినియోగించుకోవాలి

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 19: ఆధార్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని జగదేవ్‌పూర్ తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మునిగడపలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్‌సెంటర్‌ను తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. సెంటర్ నిర్వాహకులు ఎక్కువ మొత్తంలో చార్జీ వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆధార్‌సెంటర్ నిర్వాహకులు ఉన్నారు.

వరి పంటకు జాగ్రత్తలు తప్పని సరిగా తీసుకోవాలి

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 19: రైతులు వరి పైర్లలో తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని మర్కూక్ మండల వ్యవసాయాధికారి నాగేందర్‌రెడ్డి సూచించారు. సోమవారం మర్కూక్ మండలంలోని పలు గ్రామాల్లో వరిపైర్లను ఆయన పరిశీలించారు. మొగి పురుగుల నివారణకు రైతులు నాటిన 10 నుంచి 15 రోజుల మధ్యలో కార్టాప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు 4 కిలోలు లేదా ఫ్లూబెండమైడ్ గుళికలు 5 కిలోలు లేదా పనిప్రోనిల్ 6 కిలోలు గుళికలు 10 కిలోల ఇసుకలో కలిపి తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. ఆయన వెంట వ్యవసాయ విస్తరణాధికారి రజినీకాంత్, విష్ణువర్ధన్, రైతులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో ఎస్సెస్సీ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు



కార్యక్రమంలో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

కోహెడ ఫిబ్రవరి 19: మండలంలోని తంగళ్లపల్లి కస్తూర్బా పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సోమవారం వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రత్యేక అధికారి హిమబిందు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి ఫలితాలు విద్యార్థి సమగ్ర అభివృద్ధికి సూచికగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కూలీల దరి చేరని 'ఉపాధి'

● **డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి**

గజ్వేల్‌టౌన్, ఫిబ్రవరి 19: అధికారులు, పాలకుల నిర్లక్ష్యం మూలంగా 'ఉపాధిహామీ' కూలీల దరిచేరడం లేదని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి ఆరోపించారు. సోమవారం గజ్వేల్ మండలం బూర్గుపల్లి గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న పని ప్రదేశానికి వెళ్లి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఏగొండ స్వామి మాట్లాడుతూ.. వయోజనులందరికి 100 రోజుల పనిని అందించడమే లక్ష్యంగా తీసుకువచ్చిన ఉపాధిహామీ పథకం కూలీల దరిచేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గజ్వేల్ డివిజన్ పరిధిలోని గజ్వేల్ మండలంలో 100 రోజులు పూర్తయిన కుటుంబాలు 29, కొండపాక మండల్‌లో 162, ములుగు మండలంలో 151, వర్గల్ మండలంలో 109, తూప్రాన్ మండలంలో 199 కుటుంబాలవారు మాత్రమే 100 రోజుల పని చేశారన్నారు. పని ప్రదేశం వద్ద కనీస సౌకర్యాలు, పనిముట్లు అందుబాటులో లేకపోవడం, వేతనాలు సరైన సమయంలో అందకపోవడంతో కూలీలు ఉపాధికి దూరమవుతున్నారన్నారు. అధికారులు, పాలకులు స్పందించి 100 రోజుల పని కల్పించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి పేర్కొన్నారు.